సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడి

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు
● అలగాయపాలెంలో రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు

ఉలవపాడు: వేరుశనగలో సమగ్ర సస్యరక్షణ, పోషకాల యాజమాన్యం, చీడపీడల యాజమాన్యం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ బాబు అన్నారు. శుక్రవారం శాస్త్రవేత్తలు వెంకటేష్, జయతో కలిసి మండల పరిధిలోని అలగాయపాలెంలో వేరుశనగలో సామూహిక ప్రదర్శన క్షేత్రాలను అమలుపరిచి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నేల ద్వారా సంక్రమించే మొదలు కుళ్లు, వేరుకుళ్లు, ఎండుతెగులు నివారించుకోవాలన్నారు. మన దేశం ఇంకా కూడా నూనెలను ఇతరదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుందని, వేరుశనగలో ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సాధించి సహజ నూనెలు తయారు చేసుకోవచ్చని తెలియజేశారు. స్వయం సమృద్ధి సాధించడానికి ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా రైతులకు సలహాలు ఇస్తామన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు కూడా అందిస్తున్నామని తెలిపారు. సులిపురుగుల సమస్యల నివారణకు రైతులు అంతర్‌పంటగా బంతిని నాటుకుని ఎకరాకు 200 కిలోల వేప చెక్క, 2 లీటర్ల పిసిలోమిసిస్ జీవపురుగునాశని, 100 కిలోల పేడ ఎరువులో కలిపి ఆఖరు దుక్కిలో చల్లుకోవాలని తెలిపారు.


రైతులకు లింగాకర్షక బుట్టలు, ఎరువులు అందిస్తున్న దృశ్యం

పొలాల్లో రోగనిర్ధారణ సందర్శనలు చేపట్టి తామర పురుగుల నివారణకు ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరాకు 60 మి.లీ లేదా థయోమిథాక్సమ్ మందును ఎకరాకు 40 గ్రాములు, కిలో 19.19.19 ఎరువుతో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పంట 40 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును వేసుకోవాలని తెలియచేశారు. జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, జీవన శిలీంధ్ర నాశనుల వినియోగంపై పొలాల్లో విధాన ప్రదర్శనలు నిర్వహించారు. రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు, నీలం రంగుజిగురు అట్టలు, పచ్చపురుగు, లద్దెపురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు అవసరమని, వాటిని రైతులకు ఉచితంగా అందించారు. రైతు శాస్త్రవేత్తలు ముఖాముఖి ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, చరణ్ సాయికుమార్, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దూరం


చినపవనిలో మానవహారం నిర్వహిస్తున్న వైద్యాధికారులు

లింగసముద్రం: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి చినపవనిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో కలిసి డయేరియా, డెంగీ వ్యాధులపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తాగు నీటిని వేడి చేసి చల్లార్చుకుని తాగాలని సూచించారు. అనంతరం గ్రామంలో క్లోరినేషన్ చర్యలు చేపట్టి కుళాయిలు, చేతి పంపుల వద్ద మట్టి నమూనాలను సేకరించి పరీక్షించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన ఆంజనేయులు


దంపతులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది

పామూరు: వృత్తిలో సీహెచ్ ఆంజనేయులు అంకిత భావంతో పని చేశారని స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్ఎం సీహెచ్ రామస్వామి, పీయంసీ చైర్మన్ ఓగూరి ఏడుకొండలు అన్నారు. మండల కేంద్రమైన పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 19 సంవత్సరాలుగా బోధనేతర సిబ్బందిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆంజనేయులును శుక్రవారం పాఠశాలలో హెచ్‌యం రామస్వామి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ బోధనేతర సిబ్బందిగా పనిచేస్తున్న ఆంజనేయులు పాఠశాల ఉపాధ్యాయులు, తోటి సిబ్బందితో కలిమెలిసి ఉంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ షేక్ మస్తానీ, వేణుగోపాల్‌రావు, సుధాకర్‌రావు, భోగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, ఉత్తరావ్, సురేంద్ర, ఖాసీం, అలి, బోధనేతర సిబ్బంది బాలకృష్ణ, ధనలక్ష్మి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పశువైద్యశాలలో రేబిస్ వ్యాక్సినేషన్

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పశువులకు రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు పశువైద్యాధికారి ఎన్.హజరత్ ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కలకు విధిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను రేబిస్ వ్యాక్సినేషన్‌తో దూరం చేయవచ్చని పేర్కొన్నారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

జూదరుల అరెస్ట్

గుడ్లూరు (కందుకూరు): మండలంలోని పోట్లూరు గ్రామంలో పేకాట నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఇద్దరితో పాటు, రూ. 20వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు (కందుకూరు): మండలంలోని గుండ్లపాలెం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఇసుక రవాణా నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

కందుకూరు: పట్టణంలోని కోవూరు రోడ్డులో గల స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ప్రముఖ వ్యాపారి, సురేష్‌రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సురేష్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. మానవతా దృక్పథంతో విద్యార్థులకు అందించామని తెలిపారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్‌లోను పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దండే రమేష్, గంటా సాయి, వెంకటరావు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు నిలువరించాలి


పశువులమేత భూముల్లో తొలగించిన చెట్లు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురం సర్వేనంబర్ 162 పశువుల మేత భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు పొక్లెయిన్లతో చెట్లు తొలగిస్తున్నారని తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరాకు శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే సర్వే నంబర్‌లో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించవద్దని హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. తక్షణం దీనిపై తహసీల్దార్ ప్రత్యేకదృష్టి సారించి చెట్ల తొలగింపును నిలిపివేయించాలని కోరారు.

బెట్టింగ్ జూదరుల అరెస్ట్

సింగరాయకొండ: బెట్టింగ్ ఆడుతున్న ముగ్గిరిని అరెస్టె చేసిన సంఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమరాజుపల్లె పంచాయతీ ఫకీరు పాలెంకు చెందిన షేక్ పాజర్ మండల కేంద్రంలోని ప్రశాంతి థియేటర్ ఏరియాలో నివసిస్తున్న కావటి వెంకటేష్, జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్‌లను అదుపులోకి తీసుకొని 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారమని ఎస్సై టి. శ్రీరాం తెలిపారు. వీరు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ చేస్తూ అమాయకులను ఈ వృత్తిలోకి లాగారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి బుజ్జి

సీఎస్‌పురం (పామూరు): జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీని కలెక్టర్ కార్యాలయంలో మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి శుక్రవారం కలిసి బొకే అందజేశారు. కోవిలంపాడు గ్రామ పంచాయతీలో అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారం, పేదలకు నివేశన స్థలాలు కేటాయింపు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చామని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు బుజ్జి తెలిపారు.

98 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండారెడ్డి పల్లి గ్రామంలో డాక్టర్ సందీప్, డాక్టర్ లక్ష్మీ భార్గవి 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతకు కర్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

● రూ.30 వేలు జరిమానా


నందనవనం వద్ద సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

సింగరాయకొండ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును డ్రైవర్‌తో సహా అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కనుమళ్ల పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. సెబ్ పోలీసుల కథనం ప్రకారం జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన కె.యోహాన్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా 10 వేల రూపాయల జరిమానా విధించినట్లు సెబ్ సీఐ కె.నరహరి తెలిపారు. ఎస్సై సీహెచ్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం నందనవనం వద్ద పాలేరు నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్‌తో సహా సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కె.బిట్రగుంటకు చెందిన కె.ఇమ్మానుయేల్ అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడని, ఇతను రెండోసారి పట్టుబడటంతో రూ.20 వేల జరిమానా విధించామని సెబ్ సీఐ నరహరి తెలిపారు.

ఘనంగా నూతన మందిర ప్రారంభం


నూతన మందిరాన్ని ప్రారంభిస్తున్న పాస్టర్ జాన్ సుబ్బారెడ్డి

కొండపి(సింగరాయకొండ): మండలంలోని తాటాకులపాలెం గ్రామంలో నూతన కానా ప్రార్థన మందిర ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ మైఖేల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒంగోలు ఎష్కోలు మందిరం పాస్టర్ జాన్ సుబ్బారెడ్డి హాజరై ప్రార్థన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూడికలో ఆయన దైవ సందేశం అందించారు. కార్యక్రమం అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి పాస్టర్లు, విశ్వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు


ఉత్సవాలకు సిద్ధమైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌లో గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం నుంచి ఈనెల 15 వ తేదీ వరకు శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త, వ్యవస్థాపకుడు కుందురు తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ప్రతి రోజూ అమ్మవారికి అభిషేకం, ఉదయం 9 గంటలకు చండీ హోమం, మధ్యాహ్నం 1 గంటకు మంగళ హారతి తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్ర 6 గంటలకు వారాహి అమ్మ వారికి విశేషముగా సువాసినులచే సామూహిక కుంకుమార్చన, అనంతరం మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

పట్టణంలో నూతన విద్యుత్ స్తంభాలు


మాట్లాడుతున్న కమిషనర్ టీవీ రంగారావు

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీస్‌లో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు, ఎమ్యునిటీ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఒంగోలు రోడ్డు, పామూరు రోడ్డు కందుకూరు రోడ్డు, చెప్పుల బజార్ ప్రాంతాల్లో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రధాన రోడ్లల్లో డివైడర్ ఏర్పాటు చేసి సిటీ బ్యూటిఫికేషన్ చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ ఆర్ ఉమాకాంత్, ఏఈ పవన్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సచివాలయ ఎమ్యునిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడండి


సింగరాయకొండ: హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్లో శుక్రవారం సాయంత్రం హెల్మెట్ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవటం వలన తలకు తీవ్ర గాయాలయి చనిపోయే అవకాశం ఉందన్నారు. దీని వలన భార్య, పిల్లలు కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడతారని.. అందుకే హెల్మెట్ వాడి తమ జీవిత కాలాన్ని పెంచుకోవాలని సూచించారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. ఎస్సై టి. శ్రీరామ్, ఏఎస్సై షేక్ మహబూబ్‌భాషా, రైటర్ షేక్ షాకీర్ పాల్గొన్నారు.

వేలానికి నాణ్యమైన బేళ్లు తీసుకురావాలి

● పొగాకు అత్యధిక ధర కేజీ రూ.364


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు వేలం కేంద్రానికి నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకొచ్చి అత్యధిక ధర పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం పొందూరు క్లస్టర్ గ్రామాల రైతులు 1,270 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1215 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 55 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.364, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.304.94 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో రైతులకు ప్రయోజనం


భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): మట్టి పరీక్షలు చేయించడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వెన్నూరు గ్రామంలో రైతుల పొలాల్లో శుక్రవారం మట్టి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి పరీక్షలు చేయించడం వల్ల భూమిలో ప్రధాన పోషణాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఏ మేరకు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవచ్చునన్నారు. అలాగే సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్, మాంగనీస్ మూలకాల లోపాలు ఏమైనా ఉన్నాయో లేదో తెలుసుకోవచ్చని చెప్పారు. లోపాల సవరణకు ఎంత మేరకు ఎరువులు వినియోగించుకోవాలి, మట్టి పరీక్షల అనంతరం ఎంత మేర ఎరువుల వాడకం తగ్గించుకుని అధిక దిగుబడి పొందవచ్చునో తెలుసుకోవచ్చన్నారు. మట్టి పరీక్షల గురించి రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను అడిగి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వెన్నూరు వీఏఏ కొండలరావు, రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి


హాస్టల్ భవనం పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: గిరిజన గురుకుల పాఠశాల భవనాల భవన నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణ పరిధిలోని చింతల పాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను శుక్రవారం చైర్మన్ గఫార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రూ. 8.75 కోట్లు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధులు సరిపోక ఆగిన భవన నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం శివనగర్ కాలనీలో కొనసాగుతున్న గిరిజన గురుకుల పాఠశాల లో సదుపాయాలు లేక వసతులు సరిపోక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సంబంధిత అధికారులు కూడా సమస్యను ఎమ్మెల్యేకు వివరించాలని సూచించారు. ఈమేరకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుస్వామి రెడ్డి, కౌన్సిలర్ దేరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల వివాదం

కొండపి (సింగరాయకొండ): మండలంలోని మిట్టపాలెం గ్రామంలో ఫ్లెక్సీల వివాదం రేగింది. టీడీపీ ఫ్లెక్సీలు చిరిగిపోయాయంటూ.. ముగ్గురు మైనర్లపై టీడీపీ సానుభూతి పరులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిమిత్తం శుక్రవారం ఉదయం మైనర్లను పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వెళ్లారని వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా వారిని బయటకు పంపించకుండా స్టేషన్ లోనే ఉంచారని, వారు ఫ్లెక్సీలు చించినట్లు ఆధారాలు లేకుండా ఇంత సమయం స్టేషన్‌లో ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. మైనర్ల హక్కులు కాపాడాలని తాము అడగడానికి వెళితే.. స్టేషన్ లోనికి ఎందుకు వచ్చారని ఎస్సై అన్నట్లు మిట్టపాలెం వైఎస్సార్ సీపీ నేత మండవ కొండయ్య ఆరోపించారు. కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందారు.

విద్యుత్ శాఖ ఎస్ఈ మాటలు అవాస్తవం

టంగుటూరు: విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసేందుకు టంగుటూరు రూరల్ ఏఈ తనను రూ.15 వేలు అడిగితే, అలాంటిదేమీ లేదని ఎస్ఈ సత్యనారాయణరాజు చెప్పడం హాస్యాస్పదమని బిళ్లా హరిబాబు తెలిపారు. టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన బిళ్లా హరిబాబు మూడు రోజుల క్రితం విద్యుత్ కనెక్షన్ కోసం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాల్సిన విద్యుత్ శాఖ ఎస్ఈ ఎవరిని విచారించకుండానే తప్పుడు స్టేట్మెంట్ ఇచ్చారని, తనపై నిరాధారమైన నిందలు మోపారని శుక్రవారం టంగుటూరు రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత ఎనిమిది నెలలుగా కరెంటు లేక పాములతో సహజీవనం చేశామని, తన భార్యాబిడ్డలు ఇబ్బంది పడుతున్నారని వేడుకున్నా అధికారులు కనికరం చూపలేదన్నారు. ఓ పక్క ఏఈని వెనకేసుకొస్తూ, అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వాలని కోరుతూనే తాను చెప్పిందంతా అబద్ధమన్నట్లు ఎస్ఈ మాట్లాడటం సరికాదన్నారు. విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలని, లేనిపక్షంలో తన భార్యాబిడ్డలతో కలిసి ఏఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానని స్పష్టం చేశారు.


నిరసన తెలుపుతున్న బాధితుడు హరిబాబు

మధ్యాహ్న భోజనం తనిఖీ


వెలిగండ్లలో ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంఈఓ దాసుప్రసాద్


రాళ్లపాడులో భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ- 2 శివకుమార్

వెలిగండ్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వండిపెట్టాలని ఎంఈఓ దాసుప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఎంఈఓ దాసుప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట శాలను పరిశీలించి, భోజనం రుచి చూశారు. మధ్యాహ్న భోజనం తయారు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎం బి. రాఘవాచారి పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

లింగసముద్రం: మండలంలోని చినపవనిలోని ఎంపీయూపీ పాఠశాలను, రాళ్లపాడులోని ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ- 2 శివకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ యూనిఫాం ధరించి పాఠశాలకు రావాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలలో ఉన్న అంశాలను విద్యార్థులు నోట్ పుస్తకాల్లో రాసే విధంగా చూడాలని సూచించారు. బడి బయట పిల్లలను బడుల్లో చేర్పించేలా చేసి విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, రుచిగా శుచిగా ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న టాయిలెట్లను పరిశీలించారు. టాయిలెట్లు ప్రతి రోజు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.